# పేదవాడి పెద్దమనసు

రెండుచింతల భానుమతి

**ప్రియమైన చినబాబుగారికి,**

రామయ్య వ్రాయునది...ఇక్కడ మీ చిన్నాన్నగారి ఆరోగ్యం సరిగ్గా లేదు. రేపో మాపో అన్నట్టు ఉన్నారు. మీరు వీలైనంత త్వరగా రావలసింది. ఆయన ప్రాణం పోతే కర్మకాండ చెయ్యడాని క్కూడా డబ్బులు లేవు. వాళ్లబ్బాయి 18 ఏళ్లవాడు ఏదో కష్టపడి వారాలు చేసుకుని చదువుకున్నాడు. మీరు వీలైనంత త్వరగా రావలసింది. మిగిలిన విషయాలు ఇక్కడకు వచ్చిన తర్వాత మాట్లాడుకోవచ్చు.

ఇట్లు
మీ పాలేరు
రామయ్య

ఉత్తరం చదవగానే నాకు భగ్గున మండింది. బాబాయిట బాబాయి! నాన్నగారికి చెందిన పదెకరాల పొలం, ఇల్లు ఈమాట ఆమాట చెప్పి మొత్తం అంతా హస్తగతం చేసుకుని- చివరకు దిక్కులేని చావు చస్తు న్నాడు. పోనీ! నాకు ఏ కోశానా సానుభూతి కూడా రావటం లేదు. చేసు కున్నవాడికి చేసుకున్నంత అని అలాటి వాడికి అలాటి గతే పట్టింది. తల్లిదం డ్రుల పాపపుణ్యాలు పిల్లలకు అంటుకుంటాయన్నట్లు అతని కడుపున పుట్టిన కర్మానికి వాడిని అనుభవించనీ- అని ఉత్తరం పక్కన పడేసా.

అన్నట్లు...రామయ్య నాన్నగారికి ఇష్టుడనీ, అక్కడ తను చేసే పాడు పనులన్నీ నాన్నగారికి చెప్తాడేమోననీ అతడ్ని గెంటేశాడని విన్నాను. మరి రామయ్య బాబాయిమీద సానుభూతితో ఎందుకు ఉత్తరం రాశాడో అర్థంకాలేదు!

★★★

నెల గడిచిపోయింది. బందరులో ఏదో ఇన్ స్పెక్షన్ పనిపడితే అక్కడికి వెళ్ళాల్సి వచ్చింది. చల్లపల్లి బందరుకి దగ్గరే కాబట్టి రామయ్యమీద ఇష్టంతోపాటు అభిమానం ఉండటంతో పక్కనే ఉన్న బందరు-నాగాయలంక బస్సెక్కాను. దారిలో చల్లపల్లి. బస్సులో కూర్చోగానే చిన్న నాటి జ్ఞాపకాలన్నీ ఒక్కసారి గుర్తొచ్చాయి.

చల్లపల్లిలో నాన్నగారంటే అందరికీ వల్లమా లిన అభిమానం, ఎనలేని గౌరవం. మాధవయ్య గారి కొడుకుగా నాకు చాలా ఆనందం కలిగేది. ఎవరైనా వచ్చి సాయం అడిగితే కాదనకుండా చేసేవారు.

కుడిచేత్తో చేస్తే ఎడంచేతికిక్కూడా తెలియని వ్వరని అనేవాళ్ళు. నేను కూడా అందుకు ప్రత్య క్షసాక్షిని.

ఒకసారి ఆయనతోపాటు పొలానికి వెడు తుంటే పక్క వీధిలో ఉండే రమణయ్యగారు మొహం వేలాడేసుకుని వెళ్ళటం గమనించి, "ఏమోయ్ రమణయ్యా! ఏవిటలా ఉన్నావు?" అని అడిగారు.

"అబ్బే, ఏం పెద్ద సమస్యకాదులెండి" సమా ధానంగా అన్నారు.

"రమణయ్యగారూ! నా దగ్గర దాపరికం ఎందుకు చెప్పవయ్యా!" అని నాన్నగారు ఒత్తిడి చేయడంతో-

"ఏవీలేదండీ...మా రెండోవాడికి బందరు హిందూ కాలేజీలో సీటు వచ్చింది. హాస్టలుకి ఫీజు రెండువేలు అయేటట్టుంది. ప్రస్తుతానికి నా దగ్గర అంత డబ్బు లేదు. దాని గురించే ఆలోచి స్తున్నాను" అన్నారు రమణయ్యగారు.

"ఓస్ ఇంతేనా! రేపు పొలానికెళ్ళేటప్పుడు మీ ఇంటిమీదుగా వచ్చి ఇచ్చి వెడతాలే!" అన్నారు నాన్నగారు. వెంటనే రమణయ్య మొహం విప్పారింది.

"అయ్యో! మీకెందుకండీ శ్రమ. నేనే మీ ఇంటికొచ్చి తీసుకుంటా. నా నెత్తిన పాలుపోసిన ట్టయింది. వీలైనంత త్వరలో తిరిగి ఇచ్చేస్తాను" అన్నారు.

పొలంలోకి వెళ్ళింతర్వాత అందర్నీ పలక రించి అక్కడ పని చేసేవాళ్ళ బాగోగులన్నీ కను క్కునేవారు.

"ఏం సుబ్బయ్యా! నీ కూతురికి సీమంతం అని చెప్పావు. డబ్బులు సరిపడా ఉన్నాయా? మన దొడ్లో రెండు అరటి గెలలు తయార య్యాయి. వచ్చి తీసుకెళ్ళు. అమ్మాయి చీరకి, పేరంటానికి ఖర్చుకింది ఈ అయిదు వందలూ ఉంచుకో"

"అవును శర్మా! మీ అమ్మాయి పెళ్ళి పనులు ఎంతవరకు వచ్చాయి? రామయ్యా! శర్మగారికి ఒక బస్తా ధాన్యం కొలిచివ్వు. చూడండి శర్మ గారూ! మీరు మా గుమస్తా. మీకేం సాయం కావాలన్నా మొహమాటపడకుండా అడగండి" ఇలా ఉండేది నాన్నగారి ధోరణి.


ఇంట్లో అమ్మకూడా అంతే. ఇల్లు కాకుండా ఎకరం ఖాళీ స్థలం. దాంట్లో పాలేరు అన్నిరకాల కూరలు పండించేవాడు.

నాలుగు గేదెల పాడి. అమ్మ అడిగిన వాళ్ళకి కూరగాయలు ఇవ్వటమే కాకుండా, ఎవరింట్లో

పెళ్లీ పేరంటం జరిగినా ఆ ఫంక్షన్‌కి సరిపడా కూరలు, పాలు, పెరుగు- అన్నీ ఇంటినుంచే వెళ్ళేవి.

నేను అప్పుడు ఎనిమిదో తరగతో, తొమ్మిదో తరగతో చదువుతున్నాను.

అమ్మ కూచిని. ఎంతవేళైనా అమ్మ దగ్గర



కాసేపు కబుర్లాడిగాని, కథలు చెప్పించుకునిగాని పడుకునేవాణ్ణి కాదు. అమ్మకు దగ్గరగా జరిగి "అమ్మా! నాన్నగారు ఇవాళ శర్మగారికి బస్తాడు ధాన్యం కొలిపించాడు. ఎవరికో డబ్బులిచ్చారు. ఇవన్నీ చెయ్యకపోతే మన దగ్గరే బోలెడంత డబ్బు ఉంటుంది కదా!'' అని ఆడిగాను.

"పిచ్చికన్నా! డబ్బు అవసరాలు తీరుస్తుంది. సుఖాన్ని ఇస్తుంది. కాని మనం చేసే మంచిపని మనకి ఆనందం సంతోషం కలుగజేస్తాయి. మనం చేసే పనివల్ల పక్కవాడిలో సంతోషం కనపడితే అది మనకు ఎనలేని తృప్తిని స్తుంది. అయినా ఈరోజు ఇంత హాయిగా వెనక్కి తిరిగి చూసుకోకుండా ఖర్చు పెట్టుకోగలుగుతున్నామంటే ఏ జన్మలోనో పక్కవాడికి కించిత్ సాయం చేసి ఉంటాము.

అదే శ్రీరామ రక్ష అయి మనల్ని కాపాడుతోంది. నీకో జమీందారు కథ చెబుతాను... అనగనగా ఒక ఊళ్ళో ఒక జమీందారు ఉండేవాడు. ఆయన దగ్గర బోలెడంత డబ్బు ఉండేది. అయినా ఆయన తన జీవితంలో ఎవరికీ ధర్మం చేసి ఎరగడు. ఒకరోజు జమీందారు భోజనం చేస్తున్నాడు. కోడలు వడ్డిస్తోంది.

ఇంతలో ఒక బిచ్చగాడు 'భవతీ భిక్షాందేహి' అని అరుస్తున్నాడు. 'వెళ్ళు వెళ్ళవయ్యా! మావగారు చద్ది అన్నం తింటున్నారు' అని కోడలు కేకేసింది. జమీందారుకు ఎక్కడ లేని కోపం వచ్చింది. 'నీకు బుద్ధుందా? హాయిగా పంచభక్ష్య పరమాన్నాలతో భోంచేస్తూ ఉంటే, చద్ది అన్నం అంటావేమిటి?' అని కసిరాడు. అప్పుడు 'మావగారూ! మీరు పూర్వజన్మలో ఎవరికో బాగా సాయం చేసి ఉండి ఉంటారు. ఆ కారణంగా ఈ జన్మలో భోగభాగ్యాదులు అనుభవిస్తున్నారు. మరి నా లెక్క ప్రకారం మీరు చద్ది అన్నం తిన్నట్టే గదండీ' అని సమాధానం చెప్పింది కోడలు. అలా అని ఏదో ఆశించో, మన గొప్పచాటుకోవడానికో మనం సాయం చెయ్యకూడదు. పూర్వకాలంలో ఒక రాజు దగ్గర ఒకతను పని చేసేవాడట. అతను ఎవరికన్నా ఏదైనా దానం చేయవలసివస్తే తల పూర్తిగా దించుకుని తను ఎవరో తెలియకుండా చేసేవాడట. ఎందుకలా చేస్తున్నావు అని ప్రశ్నిస్తే 'ఇచ్చేది భగవంతుడు. నేను నిమిత్తమాత్రుడిని. అటువంటప్పుడు పుచ్చుకునేవాడు నా మొహం చూడనవసరంలేదు. రెండోది- నేను మనిషిని, కనుక పుచ్చుకునేవాడి మొహం చూస్తే నాలో అహం పెరగవచ్చు. తరువాత ఎప్పుడైనా అతను తారసపడి ఏమరుపాటున నాకు దండం పెట్టకపోతే కోపము రావచ్చు. ఇవన్నీ లేకుండా నాకు నేను హాయిగా ఉండటానికి ఇలా చేస్తున్నా అని చెప్పారుట. ఏం పని చేసినా మనం నిమిత్తమాత్రులంగా భావించి అంతా భగవదర్పితంగా చేస్తే మనకు దక్కేది ఎనలేని శాంతి. ఇది ఒక్కటే గుర్తు పెట్టుకో'' అంది అమ్మ.

మర్నాడు స్కూలునుంచి వచ్చేసరికి ఇంట్లో ఎవరో ముగ్గురు కొత్త మనుషులు.

వాళ్ళని బాబాయి, పిన్ని, వాళ్ళబ్బాయి అని పరిచయం చేసింది అమ్మ.

వాళ్లు ఇక్కడే ఉంటారని కూడా చెప్పింది. ఆయన వాలకం ఎందుకో నాకు మొదటి చూపులోనే నచ్చలేదు.

నాన్నగారు, ఆయన ఇద్దరూ కలిసి పొలానికి వెళ్ళేవారు. ఆయన పని తీరు చూస్తే పొలంపనులు బాగా తెలిసిన వాడులా అనిపించాడు. అమ్మనడిగా "అతనెవరూ? బాబాయి అయితే ఇంతవరకూ నేనెందుకు చూడలేదు?'' అని.

అప్పుడు అమ్మ చెప్పింది.

అతను చిన్న తాతయ్యగారి రెండో కొడుకు అని. ఏదో పొలం ఉంది. అది తగాదాల్లో పోవడంతో ఇక్కడకు వచ్చాడని. వాళ్ళ ఆవిడ చాలా నెమ్మదస్తురాల్లా అమాయకురాల్లా కనిపించింది.

నాన్నగారితో ఉన్నంతసేపూ ఆయన పొలం గురించే మాట్లాడేవాడు. ఆయన వచ్చిన ఏడాదిలోపలే నాన్నగారు ఇంకో ఎకరం పొలం కొన్నారు. కానీ ఆయన వాలకం నాకు నచ్చేది కాదు.

ఆయన్ని కొన్నిసార్లు కల్లుపాకలో, కొన్నిసార్లు కొంతమందితో కూర్చుని పేకాడుతూ గమనించి అమ్మతో చెప్తే ఆవిడ వినీ విననట్లు ఊరుకుంది.

ఇంతలో హైదరాబాదులో ఉన్న తాతయ్యగారి ఆరోగ్యం సీరియస్ అవటంతో హడావిడిగా హైదరాబాదు వెళ్ళాల్సివచ్చింది.


మా అమ్మ తాతయ్యగారికి ఒకత్తే కూతురు కావటంతో ఆయన పోవటంతో ఆయన వ్యాపార వ్యవహారాలన్నీ నాన్నగారు చూసుకోవలసి వచ్చింది. దాంతో మేము ఇంక తప్పక హైదరాబాదులోనే ఉండిపోవలసి వచ్చింది.



## జంబో క్వీన్

ప్రపంచ సుందరీమణుల పోటీల్లో నాజూకు భామలు బికినీలలో సోయగాలు ఒలకబోసి కిరీటాలు కొట్టేస్తుంటారు. దానికి ధీటుగా ఇటీవల కొన్ని సంవత్సరాలుగా ఫేట్ అండ్ బ్యూటిఫుల్ వనితకి కూడా పోటీలు పెడుతూ బహుమతులు ఇస్తున్నారు. ఈమధ్య ఇజ్రాయిల్‌లో జరిగిన 'జంబో క్వీన్' పోటీలో థాయ్‌లాండ్ బొద్దుగుమ్మ అయుధాయీ కిరీటాన్ని గెల్చుకుంది.

-తటవర్తి



నా చదువు ఎమ్.బి.ఏ. అయిన తర్వాత నాన్నగారికి వ్యాపారంలో సాయం చేస్తూ ఉండిపోయాను.

చల్లపల్లిలో వున్న పొలం పనులు మొత్తం బాబాయికి వదిలేశారు నాన్నగారు.

ఈమధ్యకాలంలో బాబాయి చాలాసార్లు రావటం ఈమాటా ఆమాటా చెప్పి అయిదారేళ్ళలో పొలం సరిగా పండటంలేదని, మొత్తం పొలం, ఇల్లు అంతా సొంతం చేసేసుకున్నాడు.

అంతేకాకుండా నాన్నగారికి నమ్మకస్తుడైన రామయ్యని కూడా గెంటేశాడని విన్నాను.

నాకెందుకో ఆయన నమ్మించి మోసం చేశాడని గట్టి నమ్మకం. వాళ్ళ ద్వారా, వీళ్ళద్వారా తెల్సిందేమిటంటే ఆయన తాగుడు పేకాటలకు బాగా అలవాటు పడి హస్తగతం చేసుకున్న ఆ ఇల్లు, పొలం కూడా తెగ నమ్మేశాడని.

ఇలా ఆలోచనల్లో మునిగి ఉండగా, బస్సు చల్లపల్లిలో ఆగింది. రామయ్యకు నాన్నగారు వంద గజాల స్థలంలో ఒక గుడిశె వేసిచ్చారు. అక్కడకు వెడితే రామయ్య అక్కడ లేడనీ, ప్రస్తుతం ఉన్నవాళ్ళకి అమ్మేసి వెళ్ళిపోయాడనీ తెలిసింది. ఎక్కడికి వెళ్లాడని ఆలోచిస్తున్న నాకు వాళ్ళే రామయ్య ఎక్కడున్నాడో చెప్పారు.

వాళ్ళు చెప్పిన వివరాల సహాయంతో రామయ్యదగ్గరికి వెళ్ళా. మొదట గుర్తు పట్టలేదు.

తర్వాత నేనని తెలిసి అమ్మ నాన్నగార్ల గురించి అడిగాడు. రెండేళ్ళక్రితమే నెలరోజుల తేడాతో ఒకరి తర్వాత ఒకరు పోయారని తెలుసుకుని చాలా దుఃఖించాడు.

అందులోనుంచి తేరుకున్న తరువాత అడిగాను. నాన్నగారు కట్టించి ఇచ్చిన ఇల్లు ఎందుకు అమ్మేశాడని.

"బాబూ! మీ బాబాయిగారికి జబ్బు చేసింది. మీరెక్కడున్నారో తెలియలా. ఆయన్ని ఆస్పత్రిలో చేర్పించా. ఆ ఖర్చులకి నాకాడ డబ్బులేక పాయె. మాధవయ్య బాబుగారిచ్చిన ఆ స్థలం, ఇల్లు అమ్మేసి ఆయనకి వైద్యం చేయించా. ఆయన కర్మకాండలకుపోగా మిగిలిన డబ్బుతో ఆరి అబ్బాయిని కాలేజీలో చేర్పించాలని చూశా. కానీ కొంత డబ్బు తక్కువయింది. కుర్రాడు బుద్ధిమంతుడు. మంచి మార్కులతో పాసయ్యాడు. చూస్తూ చూస్తూ అతన్ని అలా వదిలిపెట్టబుద్ధికాలా."

నాకు ఒక్క నిముషం ఆశ్చర్యం, కోపం కూడా వచ్చాయి.

"నిన్ను గెంటేసిన వాడికి ఇంత సాయం చేయాల్సిన అవసరం ఏమిటిట?" అని అడిగాను.

అందుకు "బాబూ! ఆయన చేసిన పాపం పుణ్యం ఆయన ఖాతాలోనివి. మాధవయ్య బాబుగారు ఏనాడూ ఏదో ఆశించి ఎవరికీ సాయం చెయ్యలేదు. తను నమ్మిన ధర్మాన్ని పాటించారు. పక్కవాడి సంతోషాన్ని తన సంతోషం అని నమ్మిన ధర్మాత్ముడు. మీ అమ్మగారూ అంతే. ఎదుటివారి తప్పులెంచక తమవరకూ చేయగలిగిన సాయం చేసిన పుణ్యాత్ములు. వారి ఉప్పు తిన్నవాణ్ణి. మీ బాబాయిగారు తప్పు చేసే ఉండవచ్చు. కానీ దిక్కులేని స్థితిలో ఆయన్ని వదిలి వేయటం భావ్య అనిపించలా. అందుకే ఇలా చేశా" అన్నాడు రామయ్య.

నాకు ఒక్కసారి ఎవరో చెంప ఛెళ్ళున కొట్టినట్లయింది.

అమ్మనాన్నల్ని ఆదర్శంగా తీసుకుని వాళ్ళు నమ్మిన సిద్ధాంతాలని అమలుపరిచాడు కేవలం వాళ్ళ దగ్గర పాలేరుగా పనిచేసిన రామయ్య. నేనో....నోరు తెరిచి అడిగినా బాబాయి తప్పు ఒప్పులు ఎంచి సాయం చేయటంతో వెనకడుగు వేశా.


అమ్మ ఎన్ని నీతికథలు చెప్పినా, అమ్మని నాన్నగార్ని- ఇద్దర్నీ దగ్గర్నించి చూసి ఎలా జీవించాలో అనే విషయం నేర్చుకోగలిగి కూడా వాళ్ళ విధానాలను అమలు పరచలేకపోయినందుకు నామీద నాకే జుగుప్స కలిగింది.

వెంటనే రామయ్యకోసం వంద గజాల స్థలం వెతికి కొనిచ్చి, దాంట్లో ఒక గుడిసె వేసుకోవటానికి డబ్బిచ్చాను.

బాబాయి కొడుకు చదివే కాలేజికి వెళ్ళి అతనికి నేనే గార్డియన్ అని కాలేజీ వాళ్ళకి చెప్పి రెండేళ్ళకి సరిపడా, ఫీజు కట్టేశాను.

అతని పేర బ్యాంకులో కొంత డబ్బువేసి వారాలు చేసుకుని తినవద్దని బాగా చదువుకోమని చెప్పాను. మంచి ర్యాంకుతో పాసయితే పైచదువులకి సాయం చేస్తానని చెప్పాను. ఇవన్నీ చేసి తృప్తిగా ఊపిరి పీల్చుకుని బస్సెక్కాను.

★



## గతం గతః

'రక్తచరిత్ర' సినిమాతో మరోసారి వార్తల్లోకి వచ్చిన బాలీవుడ్ నటుడు వివేక్ ఓబెరాయ్‌ని ఒకప్పుడు ఐశ్వర్యారాయ్ వివాహమాడేంత వరకూ పరిస్థితులు వచ్చిన సంగతి అందరికీ తెలుసు. ఇటీవల ఓ అవార్డుల ఫంక్షన్‌లో ఐష్-అభి-అమితాబ్ హాజరైనప్పుడు చిన్నపాటి యాంకరింగ్ చేసిన వివేక్ తీరుకు వచ్చిన వాళ్లంతా భలే థ్రిల్లయిపోయారు. అతడి పాత ప్రేమ కథ గురించి ఎవరైనా మాట్లాడితే మాత్రం ఊరుకోనంటున్నాడు వివేక్. అభి-ఐష్ ఇప్పుడు ఓ చక్కని వివాహజీవితాన్ని సాగిస్తున్నారు. గతం గతః ప్రస్తుతమే నాకు ముఖ్యం అని తేల్చిపారేసాడు.

